# సీత తల్లి

'ఆ వీథినా! ఆ వీథిని నేను రాను—' అని పట్టుపట్టి, ప్రక్క త్రోవల తీసుకొని వెళ్ళాడు వెంకట్రావు. కారణమేమిటని ప్రాణం తియ్యగా తియ్యగా, సిగ్గు దిగమింగి, ఒక రోజు యిద్దరం పడుకున్న తరువాత, చీకట్లో చెప్పాడు.

'మేడమీద కిటికీలో ఆ అమ్మాయిని చూచిన నాటినుంచి సరదా కలిగి రోజూ ఐదారుసార్లు ఆ దోవనే తిరుగుతో వుండేవాణ్ని. రెండో రోజున కొంచెంగా నవ్వి, నా ఆశల్ని మొలకలెత్తించింది. కాని నాలుగో రోజునుంచి కిందగుమ్మంలో వాళ్ళ తల్లిలాగుండే ఒక ఆమె నుంచుని, పైకి చూసే నా వంక, కోపంతో చూస్తో వుండడం కనిపెట్టాను. కాని ఆడదానికి భయపడతానా నేను అనుకొని, మళ్ళీ మళ్ళీ వెడుతున్నాను. రోడ్డుమీద నడిచే నన్ను ఎవరేమంటారు? కిటికీలో కూచున్న ఆ అమ్మాయి తల్లో గులాబి పువ్వులు చంపలకి అందమిచ్చాయి. ఒకసారి పైకి చూసి తలొంచుకొని వెళ్ళిపోతున్నాను.

'అబ్బాయీ! మాట, యిట్టారా.' అంది తల్లి గుమ్మంలోంచి.

దులిపేసుకుని పారిపోయి, యింక ఆ వీథిని రాకూడదని,

అనుకున్నాను. కాని ఆడదానికి భయపడతానా, అనిపించింది. ఐనా యెందుకు పిలుస్తోందో! కంఠంలో కోపం వినపట్టంలేదు. పలక్కుండ వెడితే తప్పు పని చేసినట్టుంటుంది. నేనేం చేశానని, తప్పు పట్టడానికి?- గుమ్మంలోకి వెళ్ళి

"ఎందుకు?" అన్నాను.

"ఇట్లారా! చెపుతా."

కోపంలేదు. వెడితే నేం?

లోపలికి వెళ్ళాను.

"ఇదిగో చూడు! చిన్నవాడివి, వృద్ధిలోకి రావలసిన వాడివి. ఇల్లాంటి పనులు, నీకూ, నీ కుటుంబం మర్యాదకీ తగినవి కావు."

"ఏం చేశాను?" అనబోయినాను కాని, ఆమె తిడుతో వుంటె వినడం బాగుంది. కోపంలేదు, ఆమె చక్కని కళ్ళల్లో.

"నీకు పెళ్ళయిందా?"

"లేదు."

"నీకు చెల్లెళ్ళున్నారా?"

"ముగ్గురున్నారు."

"వాళ్ళకోసం యెవరన్నా వీధి వెంబడి యిట్లా తిరుగుతూ వుంటె నీకెట్లా వుంటుంది?"

"చాలా తమాషాగా వుంటుంది."

"మంచివాడివే. మా అమ్మాయి నీ చెల్లెలంటి పిల్ల కాదూ? అట్లా అల్లరి చేస్తావా దాన్ని!"

"నేనేం అల్లరి చెయ్యలేదు."

"ఊరికే బూకరించకు. నేను చూస్తోనే వున్నాను. ఇల్లాంటి పనులు మానెయ్యి. ఇక్కడే కాదు, ఎక్కడాను. నీకోసం, నువ్వు బాగుపడాలనే చెపుతున్నాను. మా అమ్మాయి కేమీ నష్టంలేదు. ఇట్లా చూడు, ఇల్లాంటి చక్కని మొహాన్నీ, కళ్ళనీ, నీ భార్యకోసం దాచుకో. అందరికీ ఇట్లా పంచేస్తే యాడవదూ!....సరే కాని యెక్కడ చదువు కుంటున్నావు?"

"హైస్కూలులో."

"ఏ క్లాసు?"

"స్కూలు ఫైనలు."

"ఇంకేం! వూరికే అల్లరి చెయ్యకబోతే, రోజూ వొచ్చి మా అమ్మాయికి ఇంగ్లీషు చెప్పరాదూ?"

నా వొళ్ళు పరవశ మయింది.

సీతకి ఇంగ్లీషు రాదు. చెప్పినా రాదు. ఊరికే పిచ్చిగా మొహం వంక చూస్తూ కూచుంటుంది. ఆ అమ్మాయి కోసం నేనుపడ్డ ఉత్సాహం ఇంగ్లీషు చెప్పడంలో సగం పోయింది. కాని సీత అంద మైన పిల్ల. చూపులతో చాలా అల్లరి చెయ్యగలదు. ఆ తల్లి మాత్రం రోజూ పాఠం చెప్పినంత సేపూ మాతో కూచుంటుంది. కనక పుస్తకం మీదినించి సీత నాకేసి కింది చూపు లెన్ని చూపినా, నేను ఆ అమ్మాయి పాదాల్నెంత నొక్కినా ఏం లాభం లేకపోయింది. ఇంగ్లీషులో తల్లికి తెలీకుండా మాట్లాడదామంటే సీతకి అంతా కలిపి పదిహేను యింగ్లీషు మాటలొచ్చు - బల్లా, చాపా, పిల్లి మొదలైన వాటికి. ఇంక ఆ ప్రైవేటు మానెయ్యాలనుకుంటున్నాను. ఆలోచించి ఒక చీటీ రాశాను సీతకి, పుస్తకంలో పెట్టాను; ఆ రాత్రి అన్నం తొరగాతిని మేడ మెట్లమీద నుంచోమని. చదువైన తరువాత బైటికి వెళ్ళి ఒక అరగంట తిరిగి వెనక్కి వొచ్చి సరాసరి మెట్లెక్కుతున్నా. వొంటిటోంచి మాటలు వినపడుతున్నాయి. మెట్ల మధ్య నల్లచీరె చెరుగు కనపడ్డది. గుండెలు కొట్టుకుంటో మెట్లెక్కలేక పోయినాను. దీపం బాగా కనపట్టంలేదు. దగ్గిరికి వెళ్ళి బుజంమీద చెయ్యేశాను. సీత తల్లి! చప్పున నా చెయ్యి పట్టుకొని దగ్గిరకు లాగి,

"ఏమిటిది బాబు! ఇదేం పని! మంచివాడవే!"

ఇంకా యేమిటో చెప్పబోతోంది, భయంతో నేను పరిగెత్తుకుని వచ్చేశాను.

మర్నాడు వెళ్ళ సాహసించలేదు, కాని కబురు వొచ్చింది. రాత్రి ఏమీ జరగనట్టే ప్రవర్తించింది ఆమె. పది రోజులయిం తర వాత ఒక రోజు సాయంత్రం నేను వెళ్ళేప్పటికి తల్లీ కూతురూ యెవరూ ఇంట్లోలేరు. ఒక గంటసేపు కూచున్నాను. ఈ ట్యూషన్

నాకు విసుకు పుడుతోంది. ఆవిడట్లా కావిలి కూచునివుంటే, యేం లాభం? అప్పుడే వుదయించే వెన్నెల తరిమిన నల్లని ఆకాశపు చిరు నవ్వు కాంతితో నిండిన పొలాల్ని చూపి, చూపి, విసుకు పట్టింది. సీతను వొంటిగా కలుసుకోవాలి!

చీకటి పడ్డది. దీపాలెవరూ వెలిగించలేదు. బండి వాకిట్లో ఆగింది. సీత పైకి వచ్చింది. గంధం, దవనము పరిమళాలు నన్ను కమ్మాయి. చీకట్లో వెనకనే వెళ్ళి నుంచున్నాను. బీరువాలోంచి తీసిన పట్టుచీర వాసన వేసింది. మెడమీద ముత్యాలహారం, దానిమీద వొదులుగా అల్లిన జడా కనబడ్డాయి.

"సీతా!"

చప్పున తిరిగి చూసింది.

ఇంతలో కిందినించి,

"బాబు వొచ్చాడా?" అంది తల్లి.

నా ప్రయత్నమంతా విఫలమయింది.

"లేదు" అంది సీత.

ఆశ్చర్యపడి పోయినాను. ఆ 'లేదు' అన్న వొక్క మాటకే సీతకి దాస్యం చెయ్యొచ్చు! నెల రోజులు చెప్పినా ఇంగ్లీషులో వర్తమాన కాలానికీ, భూతకాలానికీ భేదం తెలీని సీత, యీ విషయములో ఎంత వివేకం చూపిందో! రెండు చేతులు జాచి సీతని దగ్గిరికి తీసుకున్నాను. ఆ పల్చని పట్టు చీరెలోంచి గట్టిచిన్న.... నన్నానుకున్నాంది. నా వేళ్ళకింది ఆమె లేత దేహం ఝల్లు ఝల్లుమని వొణికిము. చీకట్లో తిప్పేసుకునే ఆమె పెదిమల్ని వెతికాను. అట్లానుంచున్నాయి, ఎంతో సేపు, కదలడానికి భయపడుతో! మెల్లిగా సోఫామీద అట్లానే వొరిగాము. ఎంతోసేపయింది. గట్టిగా నన్ను ఆమె చేతులు వొత్తాయి. నా వొళ్ళు బాధతో లాక్కుపోయింది. ఇంతలో మెల్లిగా దీపం వెలుతురుపడ్డది. సీత తల్లి యెదురుగా నుంచుంది.

"ఏమిటిది? ఆఁ!........"

మేం మాట్లాడక విడిగా నుంచున్నాము. సీత చాలా భయపడి వొణకడమో, లేక యేడవడమో, చేస్తుందనుకున్నాను.

"నువ్వుపో!" అంది సీతని, ఆమె తల్లి.

మామూలుగా పక్కకి తిరిగి వెళ్ళిపోయాంది.

"ఏం చేస్తున్నావు? ఇందుకా నిన్నిట్లా నమ్మింది? చిన్నదాన్ని చేసి.................... మంచివాడ వనుకుని.................... ఇదా నాకు చేసే వుపకారం? సిగ్గుగాలేదూ?"

ఏం చేస్తుంది? కొడుతుందా? నేను మళ్ళీ కొట్టలేనూ? ఆమె చేతులకేసి చూశాను. గుండ్రంగా పెద్దవిగా చల్లగా,........

"నాక్కోపం వచ్చింది నీ మీద; ఏం చెయ్యనూ? ఇట్లాంటి బుగ్గల్ని........" అంటూ

దగ్గిరికి వొచ్చి నా బుగ్గలు కఠినంగా నొక్కింది.

"ఇంకెప్పుడూ యిట్లా చెయ్యనను."

నిరాశ పొందిన నా నరాలు వూరికే తహతహలాడు తున్నాయి. ఇంకా అనుభవానికై వెతుకు తున్నాయి.

"చెయ్యనన్నదాకా నిన్ను వదలను."

నా చెయ్యి పట్టుకుంది, దగ్గిరిగా నుంచుని. ఆమె వూపిరి నా తలమీద తగుల్తోంది. గాఢంగా లాగే ఆమె నిశ్వాసం నాకు వినపడుతోంది.

"ఏం, మాట్లాడవేం?"

నా మొహం దగ్గిరిగా ఆమె వెచ్చని మెత్తని రొమ్ము కమ్మేస్తోంది.

"అయితే వెళ్ళు నీను, యింతే."

ఆమెరాసుకున్న మొగలి అగరువాసన నాతల తిప్పింది.

"ఇంతే నిన్ను."

గట్టిగా కావిలించుకుంది. నా చేతులతో ఆమె చేతుల్ని పైన పట్టుకున్నాను.

*    *    *

సీతతల్లి, సీతకన్న బావుంది. కాని మళ్ళీవెళ్ళడమంటే భయంగా వుంది. ఎందు కంటే........ యింక చెప్పను.

———